నేడు డిప్యూటీ సీఎం పర్యటనకు ఏర్పాట్లు

ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

మామిళ్లగూడెం, అక్టోబర్ 26: జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం(కలెక్టరేట్)లో ఆదివారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పలు ప్రారంభోత్సవాలను చేస్తారని, దీనికి సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేసినట్లు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. శనివారం ఆ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. కలెక్టరేట్ ఎదుట నూతనంగా నిర్మించిన బస్టాప్, ఇందిరా మహిళా శక్తి క్యాంటిన్, ఫీడింగ్ రూం, ఎస్‌బీఐ బ్యాంకు, భోజనశాలను పరిశీలించారు. కలెక్టరేట్‌కు వచ్చే వారి సౌకర్యార్థం ఈ సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం కలెక్టరేట్‌కు వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వారి సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం ల్యాండ్ రికార్డ్స్ కార్యాలయాన్ని సందర్శించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, డీఆర్‌డీవో సన్యాసయ్య, అధికారులు పాల్గొన్నారు.

నేడు బోనకల్లు మండలంలో డిప్యూటీసీఎం పర్యటన

బోనకల్లు, అక్టోబర్ 26: డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క ఆదివారం మండలంలో పర్యటిస్తారని ఆయన ప్రైవేటు సెక్రటరీ టీ భాస్కరశర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో ఉదయం 11.15 గంటలకు తూటికుంట్ల నుంచి గోవిందాపురం–ఎల్ బీటీరోడ్డు, 11.45 గంటలకు బ్రాహ్మణపల్లి నుంచి రాపల్లి బీటీరోడ్డు, మధ్యాహ్నం 12.15 గంటలకు కలకోట నుంచి నారాయణపురం బీటీరోడ్డు, ఆళ్లపాడు నుంచి నారాయణపురం బీటీరోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాప చేస్తారని పేర్కొన్నారు. అదేవిధంగా చిరునోముల నుంచి దబాకపల్లి వరకు బీటీ రోడ్డుతో పాటు, కలకోట పెద్ద చెరువులో చేపపిల్లల పంపిణీ, గౌడ కార్మికులకు కాటమయ్య కిడ్స్ పంపిణీ చేస్తారన్నారు.

నాలుగు నెలల తర్వాత కుటుంబ సభ్యుల చెంతకు..

– మతిస్థిమితంలేని మహిళను మామూలు స్థితికి తెచ్చిన 'అన్నం ఫౌండేషన్'

మహిళను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న అన్నం శ్రీనివాసరావు

రఘునాథపాలెం/ఖమ్మం వ్యవసాయం, అక్టోబర్ 26 : మతిస్థితిమితం లేని స్థితిలో ఫౌండేషన్‌లో చేరిన మహిళ మామూలు స్థితిలో తిరిగి కుటుంబ సభ్యుల వద్దకు చేరింది. వివరాల్లోకెళ్తే.. కర్నూలు జిల్లాకు చెందిన శికారి ధర్మావతి మతిస్థిమితం కోల్పోయి నాలుగునెలల క్రితం ఇంటి నుంచి తప్పిపోయింది. రెండునెలల క్రితం ఖమ్మం నగరంలోని ట్రీటౌన్ ప్రాంతంలో చెత్తకుప్పల్లో అన్నం తింటూ అక్కడే తిరుగుతూ కనిపించగా స్థానిక పోలీసులు అన్నం ఫౌండేషన్‌కు సమాచారం అందించారు. అన్నం ఫౌండేషన్ అధినేత అన్నం శ్రీనివాసరావు ఆ మహిళను మానసిక వికలాంగుల వార్డులో చేర్పించి వైద్యసేవలు అందించగా మామూలు స్థితికి చేరుకుంది. తన పేరు, వివరాలను తెలియజేయడంతో శనివారం జిల్లా సంక్షేమ అధికారి వెంకటరామిరెడ్డి సమక్షంలో సదరు మహిళను కుటుంబ సభ్యులకు అప్పగించారు. అన్నం శ్రీనివాసరావుకు ఆ మహిళ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

29న డయల్ యువర్ డీఎం

మధిర, అక్టోబర్ 26: ఈ నెల 29న మధిర ఆర్టీసీ డిపోలో ఉదయం 11నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ డీ శంకర్‌రావు శనివారం తెలిపారు. డిపో పరిధిలో ఉన్న ఆర్టీసీ బస్సులకు సంబంధించి సలహాలు, సూచనలు, ఏమైనా సమస్యలు ఉంటే డీఎం దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. 9959225961 నెంబర్‌కు ఫోన్ చేసి తెలపాలని కోరారు.

న్యాయవాదులు సమన్వయంతో పనిచేయాలి

హైకోర్టు జడ్జి పి శ్రీసుధ

ఖమ్మం లీగల్: మాట్లాడుతున్న హైకోర్టు జడ్జి పి.శ్రీసుధ, మధిర: శ్రీసుధకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్

ఖమ్మం లీగల్, అక్టోబర్ 26 : న్యాయవాదులు, న్యాయమూర్తులు సమన్వయంతో కలిసికట్టుగా పనిచేసి కేసులను త్వరగా పరిష్కరించాలని హైకోర్టు జడ్జి, ఖమ్మం జిల్లా పోర్టుపోలియో జడ్జి పి.శ్రీసుధ అన్నారు. శనివారం కోర్టు ప్రాంగణంలోని ఖమ్మం బార్ అసోసియేషన్‌లో న్యాయవాదులు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఖమ్మంలో న్యాయవాదులు ఎంతో అప్యాయత చూపారని, ఖమ్మం కోర్టులో మెరుగైన సదుపాయాలు కల్పించడం కోసం ప్రయత్నిస్తామన్నారు. న్యాయవాదుల సహకారం కేసుల పరిష్కారంలో ఎంతో ఉంటుందని దానిని కొనసాగించాలన్నారు. ప్రతిఒక్కరూ బాధ్యతతో పనిచేసి కేసులను త్వరగా పరిష్కరించి కక్షిదారులకు న్యాయం చేయాలన్నారు. జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేరెళ్ళ శ్రీనివాసరావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, న్యాయమూర్తులు, న్యాయశాఖ ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అదేవిధంగా సాయంత్రం ఆలిండియా లాయర్స్ అసోసియేషన్(ఐలూ) తెలంగాణ రాష్ట్ర తృతీయ సదస్సులో హైకోర్టు జడ్జి శ్రీసుధ, జిల్లా జడ్జి పి.రాజగోపాల్ పాల్గొన్నారు.

హైకోర్టు న్యాయమూర్తులను కలిసిన కలెక్టర్, సీపీలు

మధిర, అక్టోబర్ 26: మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు ఆవరణలో కోర్టు నిర్మాణ పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమానికి వచ్చిన హైకోర్టు జడ్జీ పీ శ్రీసుధ, న్యాయమూర్తులను జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం వారితో ముచ్చటించారు.

జమలాపురం ఆలయంలో పూజలు చేసిన న్యాయమూర్తులు

ఎర్రుపాలెం, అక్టోబర్ 26: తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన జమలాపురం శ్రీ వెంకటేశ్వరస్వా మి ఆలయాన్ని శనివారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా జడ్జీలు సందర్శించారు. ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలుకి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, ఖమ్మం జిల్లా పరిపాలన న్యాయమూర్తి పీ శ్రీసుధ, హైకోర్టు న్యాయమూర్తులు భీమపాక నగేశ్, కాజా శరత్, ఖమ్మం ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ న్యాయమూర్తి జీ రాజగోపాల్, మధిర కోర్టు న్యాయమూర్తి కార్తీక్‌రెడ్డి, తహసీల్దార్ ఎం ఉషాశారద, ప్రధాన అర్చకుడు ఉప్పల శ్రీనివాసశర్మ, అధికారులు, అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన ఎమ్మెల్యే రాగమయి

మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే

సత్తుపల్లిటౌన్, అక్టోబర్ 26: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను శనివారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే మట్టా రాగమయి కలిశారు. సత్తుపల్లి ఆర్టీసీ బస్టాండ్ కంప్లెక్స్‌లోని షాపుల యజమానుల సమస్యలను పరిష్కరించాలని ఆయనకు వినతిపత్రం అందజేశారు.

పెంట్యాల పుల్లయ్య సతీమణికి పరామర్శ

మామిళ్లగూడెం, అక్టోబర్ 26 : మధిర నియోజకవర్గంలోని చింతకాని మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య సతీమణి భారతమ్మను శనివారం బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. పుల్లయ్యను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడంతో భారతమ్మ ఆరోగ్యం క్షీణించి నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నది. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, జడ్పీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ మధిర నియోజకవర్గ ఇన్‌చార్జి లింగాల కమల్‌రాజులు భారతమ్మను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని, పార్టీ అండగా ఉంటుందని వారికి ధైర్యాన్ని చెప్పారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు.

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సత్య

ఖమ్మం వ్యవసాయం, అక్టోబర్ 26 : జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా తొడుపునూరి సత్యగౌడ్ నియామకమయ్యారు. శనివారం హైదరబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో జాతీయ బీసీ సంక్షేమసంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ సత్యకు నియామక పత్రం అందజేశారు. జిల్లాలోని ముదిగొండ మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన సత్య గౌడసంఘం కమిటీలో కీలక సేవలు అందించారు. తనపై నమ్మకంతో ఈ అవకాశం కల్పించిన శ్రీనివాస్‌కు సంఘం పెద్దలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థి సంఘం నాయకుడు విక్రం గౌడ్, కులకచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, పండ్ల మనోజ్, గణేష్‌చారి. దుర్గాగౌడ్, లింగంగౌడ్, సంధ్య పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి

వైరాటౌన్, అక్టోబర్ 26: రోడ్డు దాటుతుండగా ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం వైరాలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వైరా–తల్లాడ రోడ్డులోని గంధం టవర్స్ ఎదుట వైరా మండలం గన్నవరం గ్రామానికి చెందిన లింగారెడ్డి (53) రోడ్డు దాటుతుండగా ద్విచక్ర వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108లో ఖమ్మం తరలించి చికిత్స చేస్తుండగా మృతి చెందాడు. వైరా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాదిగ వర్గీకరణ మంద కృష్ణకు ఇష్టం లేదు

ఎమ్మార్పీఎస్ నాయకుడు పిడమర్తి రవి

కూసుమంచి: మాట్లాడుతున్న పిడమర్తి రవి

కూసుమంచి, అక్టోబర్ 26: సుప్రీంకోర్టు ఇచ్చిన వర్గీకరణ ద్వారా మాదిగలకు రిజర్వేషన్ల విభజన జరిగితే పెరిగిన జనాభా ప్రకారం నష్టం జరుగుతుందని, కొత్తగా చేపట్టే కుల గణన ఆధారంగా మాదిగల ఏబీసీడీ వర్గీకరణ జరగాలని, వర్గీకరణ జరగటం మంద కృష్ణ మాదిగకు ఇష్టం లేదని ఎమ్మార్పీఎస్ నాయకుడు పిడమర్తి రవి అన్నారు. శనివారం కూసుమంచిలో జరిగిన పాలేరు నియోజకవర్గ మాదిగల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. ఏపీలో బీజేపీ, టీడీపీ, జనసేనలతో కలిసి ఎన్నికల్లో పాల్గొన్న మంద కృష్ణ ఆ రాష్ట్రంలో అవకాశం ఉండి కూడా వర్గీకరణ మాట ఎత్తడం లేదన్నారు. తెలంగాణలో వర్గీకరణ కోసం జరగుతున్న ప్రయత్నాలకు మోకాలడ్డుతున్నారని, ఏకసభ్య కమీషన్ గడువు ఈనెల 30 వరకు ఉన్నా ఉద్యమం పేరుతో మరో సారి మాదిగలను మోసం చేయడానికి తెరపైకి వస్తున్నాడని దుయ్యబట్టారు. సీఎం ను కలిసినప్పుడు కనీసం ఏబీసీడీ వర్గీకరణ మాట ఎత్తని మంద యూనివర్సిటీలకు ప్రకటిస్తున్న వీసీల్లో ఒకటి ఇవ్వాలని కోరడం ఎంత వరకు సమంజసమన్నారు. అనంతరం పాలేరు నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జిగా జిల్లా విజయ్ కమార్, మండల ఇన్‌చార్జీగా కస్తాల రంగరాజును ఎన్నుకున్నారు. సమ్మేళనంలో జిల్లా అధ్యక్షుడు మట్టే గురుమూర్తి, అనీల్, వంశీ, చాట్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా మాదిగ సమ్మేళనాలు

వైరాటౌన్, అక్టోబర్ 26: రాష్ట్రంలో మాదిగలకు 12% రిజర్వేషన్ సాధన కోసం మాదిగ జేఏసీ ఏర్పాటు చేసి ఉద్యమిస్తున్నాని మాదిగ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు పిడమర్తి రవి అన్నారు. శనివారం వేల్పుల మురళి అధ్యక్షతన వైరాలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదిగలకు 12% రిజర్వేషన్ కల్పించాలని, జిల్లాను యూనిట్‌గా చేసి వర్గీకరణ చేయాలనే డిమాండ్‌తో రాష్ట్ర వ్యాప్తంగా మాదిగ సమ్మేళనాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సమావేశంలో వక్కలగడ్డ సోమచంద్రశేఖర్, కొడారి ధీరన్, మాట్టే గురుమూర్తి, కొండమీది గోవిందరావు, దేవరకొండ నరేశ్, నక్క మహేశ్, ఆదూరి ప్రేమ్‌కుమార్, శ్రీహరి, మోదుగు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎడ్లబండ్లతో ఇసుకను తరలించే అవకాశాన్ని కల్పించండి

మధిర, అక్టోబర్ 26: ఎడ్లబండ్లతో ఇసుకను తరలించే అవకాశాన్ని కల్పించాలని కోరుతూ శనివారం మున్నూరుకాపు నియోజకవర్గ అధ్యక్షుడు ఆళ్ల కృష్ణ ఆధ్వర్యంలో తహసీల్దార్ రాళ్లబండి రాంబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధిర మున్సిపాలిటీ పరిధిలో రోజువారి ఇసుక బండ్ల ఆధారంతో జీవనోపాధి కల్పిస్తున్న ఎండ్లబండ్ల యజమానులు జీవనం సాగిస్తున్నారన్నారు. వారిని ఇసుక తోలకుండా అధికారులు అడ్డుకొని జీవనోపాధి లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుక తోలుకునే విధంగా అనుమతి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఇసుక బండ్ల యజమానులు పదిలం కొండ, రెడపంగి ఏసు, సంపసాల లింగరాజు, చంపసాల కోటేశ్వరరావు, గుమ్మా సూరి, గోసి రామకృష్ణ, గూడెల్లి నర్సింహారావు పాల్గొన్నారు.

'సాయిస్ఫూర్తి'లో ఈఎస్‌పీ–32పై వర్క్‌షాప్

సత్తుపల్లిటౌన్, అక్టోబర్ 26: మండలంలోని సాయిస్ఫూర్తి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్(ఈజీఈ) మూడోసంవత్సరం విద్యార్థులకు ఐఓటీ (ఇంటర్ నెట్ ఆఫ్ థింగ్స్) అండ్ ఈఎస్‌పీ–32 పై శనివారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్ వల్ల ఈసీఈ విద్యార్థులు ప్రభుత్వ, కార్పొరేట్ సంస్థల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు సాధించవచ్చని హైదరాబాద్‌కు చెందిన ఆర్బిట్‌టర్నింగ్ రిసోర్స్ పర్సన్ ఎం అభినవ్ తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఊటుకూరి శేషారత్నకుమారి మాట్లాడుతూ రోజురోజుకూ కొత్త పుంతలు తొక్కుతున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సమీప భవిష్యత్‌లో గణనీయమైన స్థాయిలో ఉద్యోగాలు సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సీఈసీ విభాగాపతి డాక్టర్ పాముల బాబు, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఊటుకూరి శేషారత్నకుమారి, డాక్టర్ పాముల శేఖర్‌బాబు, కళాశాల ప్రోగ్రాం కోఆర్డినేటర్ పీ నాగశేఖర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట గిరిజన మహిళల ఆందోళన

పెనుబల్లి, అక్టోబర్ 26: తమ ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రానికి ఎలాంటి నోటిఫికేషన్ ఇవ్వకుండా బీసీ మహిళకు కేటాయించారని అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ శనివారం పెనుబల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట గిరిజన మహిళలు ఆందోళన చేశారు. మూడేళ్లుగా ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్ట్‌ను ఎస్టీ మహిళలకు కేటాయించాలని పలుమార్లు వినతిపత్రాలు అందజేశామని, అయినప్పటికీ తమకు తెలియకుండా ఎలాంటి నోటిఫికేషన్ లేకుండా బీసీ మహిళకు అక్రమంగా కేటాయించారని ఆరోపించారు. అంగన్‌వాడీ సెంటర్‌కు అక్రమంగా జరిగిన బదిలీని నిలిపివేయాలని, బదిలీకి సహకరించిన ఉద్యోగులపై చర్యలు తీసుకొని ఎస్టీ మహిళలకు అంగన్‌వాడీ టీచర్ పోస్టు కేటాయించాలని అన్నారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ తావునాయక్, ఎస్‌కే గౌస్, బీఆర్ఎస్ నాయకులు తేళ్లూరి నాగేశ్వరరావు, మహిళలు ఉన్నారు.

రాకాశితండాలో వైద్య శిబిరం

రోగులకు మందులు అందజేస్తున్న వైద్యులు

తిరుమలాయపాలెం, అక్టోబర్ 26: మండలంలోని రాకాశితండాలో బడావొ బంజార ఫోజేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రజలకు వైద్యులు వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ ఫౌండర్ డైరెక్టర్ డాక్టర్ భూక్యా లాజరస్ లాల్‌సింగ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆనంద్ ప్రేమ్‌సాగర్, మేనేజర్ సోలోమెన్, వైద్యులు పాల్గొన్నారు. అనంతరం సంస్థ ఆధ్వర్యంలో తండావాసులకు వంట సామగ్రి, బియ్యం అందజేశారు.

'సుడా' పరిధిలో 20 గ్రామాలు

మధిరరూరల్, అక్టోబర్ 26: మండలంలోని 20 గ్రామాలను స్తంభాద్రి పట్టణాభివృద్ధి (సుడా) పరిధిలో కలుపుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మండలంలోని రొంపిమళ్ల, మల్లారం, జాలిముడి, యండపల్లి, సిరిపురం, వంగవీడు, కృష్ణాపురం, ఆత్కూరు, మాటూరు, నాగవరప్పాడు, సిద్దినేనిగూడెం, దెందుకూరు, నక్కలగరుబు, రాయపట్నం, ఇల్లూరు, చిలుకూరు, ఖమ్మంపాడు, తొండలగోపారం, తొర్లపాడు, నిధానపురం గ్రామాలను సుడా పరిధిలో కలుపుతున్నారు.

29న ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్

మామిళ్లగూడెం, అక్టోబర్ 26 : జర్మనీ దేశంలో ఆటోమోటివ్ టెన్నిషియన్, ఎలక్ట్రీషియన్, హెవీ మోటర్ వాహన డ్రైవర్, ఆస్పిల్ డంగ్ విభాగాల్లో అప్రెంటీస్‌షిప్‌గా పని చేయడానికి నైపుణ్యం ఉన్న అభ్యర్థులు ఈ నెల 29వ తేదీన తమ పేరును నమోదు చేసుకోవాలని జిల్లా ఉపాధికల్పనాధికారి మమత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 29న ఐటీ హబ్ గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న టాస్క్ ప్రాంతీయ కేంద్రంలో టామ్ కామ్ ఎన్రోల్‌మెంట్ డ్రైవ్‌కు హాజరుకావాలని సూచించారు. ఎంపిక చేసిన అభ్యర్థులకు జర్మన్ భాషపై శిక్షణ అందించి ఉపాధి కల్పన అవకాశాలు కల్పిస్తారని తెలిపారు. పూర్తి వివరాలకు 9440052592, 8125251408, 9440049013, 9440049645 నెంబర్లను సంప్రదించాలని సూచించారు. అర్హత గల అభ్యర్థులు www.tpmcom.telangana.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు.

ఆర్టీసీ లాజిస్టిక్ సేవలు ఇక ఇంటివద్దకే..

మామిళ్లగూడెం, అక్టోబర్ 26: టీజీఎస్ఆర్‌టీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న లాజిస్టిక్ సేవలు ఇక ఇంటి వద్దకే చేరుతాయని ఉమ్మడి వరంగల్, ఖమ్మం ఏటీఎం పవన్‌కుమార్ శనివారం తెలిపారు. వినియోగదారుల పార్సిల్స్ ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వేగంగా భద్రంగా చేరవేస్తూ అనేక ప్రశంసలు అందుకుంటూ ముందుకెళ్తున్న టీజీఎస్ఆర్‌టీసీ లాజిస్టిక్ సేవలు మరో నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. ఎంపిక చేసిన 31 ప్రాంతాల్లో ఇంటివద్దకే పార్సిల్స్‌ను చేరవేయుటకు నిర్ణయం తీసుకుందన్నారు. వినియోగదారులు బుకింగ్ సమయంలో తమ పూర్తి చిరునామా, పిన్‌కోడ్ కచ్చితంగా తెలిజేయాలని, దీనిపై హోం బుకింగ్ అని బుక్ చేయాలని తెలిపారు.

ఎన్ఎస్‌సీ కాలనీ స్కూల్ సందర్శన..

ఖమ్మం ఎడ్యుకేషన్, అక్టోబర్ 26 : నగరంలోని ఎన్ఎస్‌సీ కాలనీ ప్రభుత్వ పాఠశాలను శనివారం ట్రైనీ ఐఏఎస్‌ల బృందం సందర్శించింది. తరగతి గదులను పరిశీలించి హెచ్ఎం, ఉపాధ్యాయులతో మాట్లాడారు. పాఠశాలల నిర్వహణపై జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి కేశవపట్నం రవికుమార్ వివరించారు.

మున్సిపల్ కార్యాలయం సందర్శన

ఖమ్మం, అక్టోబర్ 26 : ఖమ్మం నగరపాలక సంస్థ కార్యాలయాన్ని ట్రైనీ ఐఏఎస్‌లు సందర్శించారు. ఖమ్మంలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి వారికి కమిషనర్ అభిషేక్ అగస్త్య వివరించారు. కార్పొరేషన్‌లో జరిగే పనితీరును గురించి, ఇంజినీరింగ్, శానిటేషన్, రెవెన్యూ తదితర అంశాలపై వారికి వివరించారు.

ఎస్సైగా ఉద్యోగోన్నతి పొందిన రహీం

కొణిజర్ల, అక్టోబర్ 26: మండలంలోని సిద్ధిక్‌నగర్ గ్రామానికి చెందిన షేక్ రహీం సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగోన్నతి పొందాడు. 1984 లో కానిస్టేబుల్‌గా చేరిన రహీం ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని కొత్తగూడెం, వైరా, అశ్వాపురం, నేలకొండపల్లి, ఆళ్లపల్లి, ముదిగొండ, బయ్యారం, కామేపల్లి తదితర మండలాల్లో పనిచేశారు. ప్రస్తుతం ఇంటెలిజెన్సీ విభాగంలో పనిచేస్తున్న ఆయన ప్రస్తుతం ఎస్సైగా ఉద్యోగోన్నతి పొందారు.

ఇంటిలిజెన్స్ ఎస్సైగా సత్యనారాయణ

సత్తుపల్లిటౌన్, అక్టోబర్ 26: సత్తుపల్లి ఇంటిలిజెన్స్ ఏఎస్సైగా పనిచేస్తున్న సురా సత్యనారాయణ శనివారం ఎస్సైగా బాధ్యతలు స్వీకరించారు. శుక్రవారం వరంగల్ డీఐజీ కార్యాలయం నుంచి వచ్చిన ఉద్యోగోన్నతి ఉత్తర్వులో భాగంగా ఆయన శనివారం వరంగల్‌లోని డీఐజీ చంద్రశేఖర్‌రెడ్డి నుంచి ఎస్సైగా బాధ్యతలు స్వీకరించారు. సత్యనారాయణను ఎమ్మెల్యే మట్టా రాగమయి కల్లూరు ఏసీపీ అనిశెట్టి రఘు, సత్తుపల్లి సీఐ కిరణ్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంటకవీరయ్య, అభినందించారు.

గురుదక్షిణ భవనాన్ని ప్రారంభించిన హైకోర్టు న్యాయమూర్తి

మధిర రూరల్, అక్టోబర్ 26: మండలంలోని సిరిపురం బాపూజీ ఉన్నత పాఠశాల, కళాశాలలో పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన గురుదక్షిణ భవనాన్ని శనివారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కాజా శరత్ ప్రారంభించారు. తొలుత ఆయనకు పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఈ సదుపాయాలను సద్వినియోగం చేసుకుని చదువుల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో మధిర సీనియర్ సివిల్ న్యాయమూర్తి మీరా ఖాసీం సాహెబ్, తహసీల్దార్ రాంబాబు, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, పూర్వ విద్యార్థుల సంఘం గౌరవాధ్యక్షుడు కర్నాటి రామ్మోహన్‌రావు, అధ్యక్షుడు శీలం చెన్నారెడ్డి పాల్గొన్నారు.

విలేకర్లపై దురుసుగా ప్రవర్తించిన తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలి

వేంసూరు, అక్టోబర్ 26: సత్తుపల్లికి చెందిన విలేకరులు సమాచారం కోసం శనివారం వేంసూరు తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లగా తహసీల్దార్ ఎంఏ రాజు దుర్భాషలాడి కేసులు పెడతానని బెదిరించారు. దీంతో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) యూనియన్ ఆధ్వర్యంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాకు చెందిన విలేకర్లు తహసీల్దార్ వచ్చి క్షమాపణ చెప్పాలంటూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ విషయాన్ని ఆర్ఐ ఆర్డీవోకు సమాచారం ఇవ్వగా ఆర్డీవో విలేకర్లతో ఫోన్‌లో మాట్లాడి తహసీల్దార్‌పై చర్యలు తీసుకుంటామని చెప్పడంతో ధర్నా విరమించారు. ధర్నాలో సత్తుపల్లి, వేంసూరు మండలాలకు చెందిన ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా విలేకర్లు, టీయూడబ్ల్యూజే (ఐజేయూ) సభ్యులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

చింతకాని, అక్టోబర్ 26: మండలంలో తిమ్మినేనిపాలెం గ్రామానికి చెందిన టీ సరస్వతి, నాగమణిలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నమోదు చేశామని ఎస్సై షేక్ నాగుల్‌మీరా తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. అదే గ్రామంలో నివసిస్తున్న డీ ఉమారాణి అనే మహిళ టీ సరస్వతి ఇంటికెళ్లి కూలీ డబ్బులు అడిగినందుకు ఇద్దరు మహిళలు కొట్టి కులం పేరుతో దూషించారు. ఉమారాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇద్దరిపై ఎస్సై కేసు నమోదు చేశారు.

మహిళ ఆత్మహత్య

ఖమ్మం రూరల్, అక్టోబర్ 26: ఒంటి, కీళ్లనొప్పుల బాధ భరించలేక మహిళా ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం మండలంలో చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తెల్దారుపల్లి గ్రామానికి చెందిన వంగూరి చుక్కమ్మ (70) కొద్ది రోజుల నుంచి జ్వరం, ఒళ్లు, కీళ్ల నొప్పులతో బాధపడుతుంది. ఈనెల 25వ తేదీన